క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన కలెక్టరేట్ ఏవో



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని కలెక్టరేట్ ఏవోగా నియమితులైన సీహెచ్ వీరాంజనేయప్రసాద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కలెక్టరేట్ ఏవోగా సీహెచ్ వీరాంజనేయప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

దోమల నివారణ మందు పిచికారీ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్, దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. సీబీఎం బోర్డింగ్, బీసీ బాలుర వసతి గృహం, వంతెన ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో తోట శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఈ-పంట నమోదును ప్రారంభించండి

కోడూరు: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు ప్రక్రియను వీఏఏలు, వీఆర్వోలు వెంటనే ప్రారంభించాలని ఏఓ శ్రీధర్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ పద్మప్రియ అధ్యక్షతన రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులు తమ పంట వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఏఓ సూచించారు. సచివాలయాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఈక్రాప్ చేస్తారని తెలిపారు. సెప్టెంబర్ 15వ తేదీ లోపు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి వివరించారు.

పీఏసీఎస్‌లకు లీగల్ సెల్ అడ్వైజర్‌గా రాయపూడి



కోడూరు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్‌లు) లీగల్ అడ్వైజర్‌గా అవనిగడ్డకు చెందిన న్యాయవాది రాయపూడి వేణుగోపాలరావు నియమితులయ్యారు. సోమవారం కోడూరులోని కృష్ణా సహకార బ్యాంక్‌ను వేణుగోపాలరావు సందర్శించి, సంఘాల సీఈఓలతో మాట్లాడారు. బ్యాంక్ పరిధిలో ఉన్న సొసైటీల వివరాలు, రుణాల మంజూరు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బ్రాంచ్ మేనేజర్ కొండవీటి సుధీర్, సిబ్బంది పాల్గొనారు.

పూరింటికి విద్యుత్ సౌకర్యం కల్పించిన దాత



అవనిగడ్డ: మండల పరిధిలోని రామచంద్రపురం శివారు వలందపాలెం చెరువుగట్టున ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తుమ్మా కోటేసు కుటుంబం నివాసం ఉంటోంది. చెరువుగట్టున దీపాల వెలుగులో పూరింటిలో ఉండటం గమనించిన పంచాయతీ కార్యదర్శి బడే శేషగిరిరావు తన సొంత ఖర్చులతో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆ కుటుంబానికి వెలుగులు అందించారు.

నూతన భవనాల నిర్మాణానికి కృషి

ఘంటసాల: ఘంటసాలలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళాశాల వివరాలను, విద్యార్థులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్యప్రియ లలితను, కళాశాల, హాస్టల్స్‌లో కల్పిస్తున్న సౌకర్యాలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవనాలు ఇబ్బందిగా ఉన్నాయని, మరమ్మతులు చేయాలని వారు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.11 లక్షల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో ప్రహరీ నిర్మించనున్నట్లు చెప్పారు. తాత్కాలిక మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని పీఆర్‌ఏఈఈ జె.నాగేశ్వరరావును ఆదేశించారు. మండలంలో రూ.3 కోట్లతో రహదారులు అభివృద్ధి చేస్తామని అన్నారు.

తప్పని సాగునీటి కష్టాలు

- ఆయిల్ ఇంజిన్లే ఆధారం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- కాలువల్లో నీటి మట్టం పెంచాలని వినతి



ఆముదాలపల్లి పంట కాలువపై ఇంజిన్లు ఏర్పాటు చేసుకున్న రైతులు



బోదెలోని నీరు ఎక్కకపోవడంతో కాలువకు గండి పెట్టిన మద్దేటిపల్లి రైతులు



కృత్తివెన్ను మండలంలో నీటికోసం ఆయిల్ ఇంజిన్ సిద్ధంచేస్తున్న రైతులు

బంటుమిల్లి: పుష్కలంగా నదులు నిండినా రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. తీర ప్రాంతంలో సకాలంలో నాట్లు వేయకపోతే తరుణం మించి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బంటుమిల్లి ప్రధాన కాలువకు పూర్తి స్థాయిలో నీటి విడుదల జరగకపోవడంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు ఆయిల్ ఇంజిన్లపై ఆధారపడుతున్నారు. దాదాపు 20 రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నీటి పారుదల శాఖ అధికారులు కాలువకు నీటి విడుదలను తగ్గించుకుంటూ వచ్చారు. పట్టిసీమ నుంచి నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అదికూడా సరఫరా కాలేదు. ఒక పక్క నదులు పొంగిపొర్లుతుంటే తీర ప్రాంత రైతులు సాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

8,600 హెక్టార్లలో పరిస్థితి ప్రశ్నార్థకం..

మండలంలో ఇప్పటికే దాదాపు 4600 హెక్టార్లలో రైతులు సార్వా విత్తనాలు వెదచల్లారు. ఇదికాక 700 హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉండగా ఇప్పటికి 300 పూర్తికాగా ఇంక 400 హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉందని వ్యవసాయశాఖ అధికారి శివరామకృష్ణ తెలిపారు. నీరు అందని కారణంగా ముంజులూరు, కంచడం, బర్రిపాడు గ్రామాల రైతులు కాలువలకు అడ్డంకులు పెట్టి నాట్లు వేస్తున్నారు. దీని కారణంగా నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. గత వారం రోజులుగా ఎండలు రోహిణి కార్తెను తలపిస్తుండటంతో పొలాల్లో నీరు లేక పలు గ్రామాల్లో భూములు నెర్రెలిచ్చాయి.

రాత్రీపగలు శ్రమించి..

ఇది ఇలా ఉంటే వెదచల్లిన ఆముదాలపల్లి, ములపర్రు, పెదపట్నం, పెందుర్రు, కొర్లపాడు తదితర కాలువల పరిధిలోని రైతులు పంటలు కాపాడుకోవడానికి రాత్రి, పగలు పెద్ద ఎత్తున ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పంటలకు నీరు తరలిస్తున్నారు. బంటుమిల్లి ప్రధాన కాలువపై పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని వేలాది ఎకరాల సాగు భూములు ఆధారపడి ఉన్నాయి.

అరకొర సాగునీటితో అవస్థలు..

బంటుమిల్లి కాలువ స్థాయి 900 క్యూసెక్కులు కాగా గత నెల 12వ తేదీన కాలువలకు నీరు విడుదల జరిగిన తర్వాత అత్యధికంగా 550 క్యూసెక్కులు విడుదల చేశారు. దీని కారణంగా రైతులకు పూర్తి స్థాయిలో నీరు అందడంలేదు. గత రెండు రోజుల వరకు కాలువకు 400 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేసినట్లు మంగళవారం నుంచి 500 క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈఈ నాగేశ్వరరావు తెలిపారు. అయినా నీరు అందక ఆయిల్ ఇంజిన్లతోనే రైతులు నీరు పెట్టుకుంటున్నారు. తూములు అందనిచోట రైతులు కాలువకు గండ్లు పెట్టుకుని బోదెల్లోకి నీరు తరలిస్తున్నారు. సోమవారం వరకు ఎండలు రోహిణిని తలపించినా మంగళవారం మాత్రం వర్షం పడకపోయినా ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లపడింది.

రైతుల వినతి..

ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువలకు పూర్తి స్థాయిలో నీరు విడుదల చేసి పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు. పంటలు ఆలస్యం కాకుండా కాపాడాలని విన్నవిస్తున్నారు.

ఆయిల్ ఇంజిన్‌లే ఆధారం..రైతుకు పెనుభారం

కృత్తివెన్ను: ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక శాతం మంది ఆయిల్ ఇంజిన్లే ఆధారంగా ముందుకు సాగుతున్నారు. శివారు ప్రాంతాలలోని రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ప్రధాన పంటకాలువకు చేరువలో ఉన్న వారు ఆయిల్ ఇంజిన్లతో నీటిని తోడుకుంటుండగా, శివారున ఉన్న వారు నీటికోసం కాలువవైపు, ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంజిన్ల సాగుతో ఎకరానికి కనీసం రైతుకు ఆరు నుంచి ఎనిమిదివేల రూపాయలు అదనపు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. ఎగువన ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా వస్తుండగా శివారు ప్రాంతాలకు మాత్రం నీటిజాడే లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని రైతాంగం లబోదిబో అంటున్నారు. కాలువల ద్వారా సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో సాగునీరందించాలి

ఘంటసాల 3/2 ఛానల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ఘంటసాలలో 3/2 ఛానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అధికారులు

ఘంటసాల: ఘంటసాల 3/2 ఛానల్ పరిధిలోని రైతులకు రెండు రోజుల్లో సాగునీరందించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాక్షి పత్రికలో మంగళవారం 'సాగుప్రశ్నార్థకం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎమ్మెల్యే, ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవి కుమార్, డ్రెయినేజీ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, నేతలు యువనేత మండలి వెంకట్రామ్, రైతులతో కలసి ఘంటసాలలోని 3/2 ఛానల్‌ను మంగళవారం పరిశీలించారు. సాగునీరు దిగువకు రాకపోవడానికి కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఘంటసాలపాలెంలో కాలువలో అడ్డీలు, ఇంజిన్లు, విద్యుత్తు మోటర్లను తొలగించి దిగువ రైతులకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ డీఈఈ రవి కిరణ్‌కు ఆదేశించారు. మూడు రోజులు ఘంటసాలకు, మూడు రోజులు ఎగువ వారికి సాగునీరందించేలా చేస్తామని తద్వారా రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని డీఈఈ ఎమ్మెల్యేకు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని డ్రెయినేజీల్లో రూ.23 కోట్లతో తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు.

ఇరిగేషన్ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

ఘంటసాల 3/2 ఛానల్ పరిధిలో సమస్యలపై పలుసార్లు డీఈఈ, ఏఈలకు విన్నవించుకున్నా పట్టించుకోలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చొరవ తీసుకుని సకాలంలో సాగునీరందించి రైతులను ఆదుకోవాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఉప సర్పంచ్ అయినపూడి భాను ప్రకాష్, నేత బండి పరాత్పరరావు, రైతులు వేమూరి రమేష్, పరిశే చలపతి, వేమూరి శివరామ కృష్ణయ్య, రత్నశేఖర్, ఇరిగేషన్, డ్రెయినేజీ ఏఈలు టి.ప్రసాద్, కె.హరీష్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరం



గూడూరు: అప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలే శ్రేష్టమని ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని తరకటూరులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ శిశువులకు తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి బిడ్డ ఎదుగుదల ఆరోగ్య వంతంగా ఉంటుందన్నారు. బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్న విషయాన్ని తల్లులు గుర్తుంచాలని ఆమె సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

ఘంటసాల: రేషన్ పంపిణీల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ సూచించారు. స్థానిక కార్యాలయంలో మండల పరిధిలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు, వీఆర్వోలతో తహసీల్దార్ మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ విజయప్రసాద్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైస్ కార్డు దారులకు ఇబ్బందుల్లేకుండా సక్రమంగా, సకాలంలో రేషన్ పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడకుండా బాధ్యతతో విధులను నిర్వహించాలని తహసీల్దార్ విజయ ప్రసాద్ తెలిపారు. డీటీ సీహెచ్.చిట్టిబాబు, సర్వేయర్ డీటీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ గుడివాడకు పతకాల పంట

గుడివాడ టౌన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ గుడివాడ సేవా కార్యక్రమాలకు గాను 11 అవార్డులు సాధించినట్లు క్లబ్ అధ్యక్షుడు విస్సంశెట్టి కృష్ణకిషోర్ తెలిపారు. లయన్స్‌క్లబ్ కార్యాలయంలో సాధించిన పతకాలను మంగళవారం మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2023-24 సేవా కార్యక్రమాలకు గాను తమ క్లబ్ ఉత్తమ సేవా అవార్డుతో పాటు కంటి పరీక్షలు, ఆపరేషన్‌లు, ఉచిత భోజన సౌకర్యం, విద్యార్థులకు వైద్య పరీక్షలు, తదితర కార్యక్రమాలకు ప్రత్యేక అవార్డులు వచ్చాయన్నారు.

శానిటరీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరామయ్య

పెడన: పట్టణంలో విష జ్వరాలు అధికంగా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శానిటరీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి తమ ప్రాంతాలపై పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన తన ఛాంబరులో పట్టణంలోని శానిటరీ కార్యదర్శులు, మేస్త్రీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. తమ ప్రాంతాల్లో విషజ్వరాలు భారిన పడి ఆసుపత్రికి వెళ్లలేని వారుంటే గుర్తించి ఆసుపత్రికి తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పక్కనుండే వారి సాయం తీసుకోవాలని సూచించారు. ఆయా వార్డులకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లను కూడా ఆదేశించామని, వారు కూడా సమాచారం ఇస్తారన్నారు. పరిసర ప్రాంతాలలో దోమల బెడద లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇబ్బందులుంటే తక్షణం తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉండవద్దని, పరిస్థితి చేయిదాటకు మునుపే జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పరిస్థితి విషమిస్తే మీపై శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం తగదు

ఆప్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్న)

పెడన: తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు సమంజసం కాదని అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్న) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఆ రాష్ట్ర సీఎం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పుపై ఇటీవల ప్రస్తావించారని, పేరు మార్పును విరమించుకోవాలని చిన్నా కోరారు. టీడీపీ స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణం చేసిన ఎన్టీరామారావు భారతదేశంలో భాషా ప్రాతిపదిక మీద స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయం 1985 డిసెంబర్ 2న ప్రత్యేక శాసనసభ చట్టం సంఖ్య 27 ద్వారా హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీ రామారావు మానస పుత్రిక అని చిన్న తెలిపారు. 1998 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలో ఉండగా తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా పేరు పెట్టడం జరిగిందని, పొట్టి శ్రీరాములు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి అనే భావనతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యక్తి పేరు పెట్టాలని ఆలోచన సరికాదని చిన్న పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం తోటే భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని, పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతో ఏర్పడ్డ భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో పొట్టి శ్రీరాములుకు తగు గౌరవం ఇచ్చే విధంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆక్రమణదారులకు నోటీసులు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. స్థానిక గురజ రోడ్డులో డ్రెయిన్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి, అంబేడ్కర్ నగర్ వద్ద రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసులో పేర్కొన్నారు. ఈ ఆక్రమణల వలన అనేక అవస్థలు పడుతున్నట్లు పంచాయతీ పాలక వర్గానికి ప్రజలు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు నోటీసులు జారీ చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కాసగాని శ్రీనివాసరావు

గూడూరు: పోలవరంలోని కలంకారీ కార్మికులకు నిత్యవసర వస్తువులను మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. స్థానిక స్నేహిత కలంకారీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గూడూరు, పోలవరం మాజీ సర్పంచులు అన్నం హరిరామకృష్ణ, కారుపర్తి రత్నం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఆత్మస్థైర్యంతో ఉండాలి

డీఎంహెచ్‌వో గీతాబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గీతాబాయి, చిత్రంలో భారతి

మచిలీపట్నంటౌన్: బాలికలు ఒత్తిడి, భయం, సామాజిక ఇబ్బందులను అధిగమించేందుకు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి గీతాబాయి అన్నారు. జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీ పద్మావతి జూనియర్ మహిళా కళాశాలలో విద్యార్థులకు జాతీయ మానసిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు సమాజంలో జరుగుతున్న అగత్యాలకు ఆందోళన చెందకుండా మనోధైర్యంతో మెలగాలన్నారు. జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం అధికారి హిమబిందు మాట్లాడుతూ ఇతరుల పట్ల రాగద్వేషాలకు వెళ్లకుండా మంచిపనులను అలవాటు చేసుకోవాలని, ప్రతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలని బాలికలకు వివరించారు. సరైన లక్ష్య సాధన కలిగి ఉండి తనకు, ఊరికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ భారతి సింగరాజు, జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహేష్, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నగర మునిసిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు మంగళవారం హాజరయ్యారు. కార్యాలయంలోని మీటింగ్‌హాలులో ఈ సమావేశంలో పాల్గొని మంత్రి ఇచ్చిన సూచనలను నమోదు చేసుకున్నారు. ఆగస్టు 15వ తేదీన నగరంలో అన్న క్యాంటీన్ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో పాత అన్న క్యాంటీన్లతో పాటు కొత్తగా మరో 20 అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే వారికి తాగునీరు, మంచి భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అన్న క్యాంటీన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు టాయిలెట్లు సిద్ధం చేయాలన్నారు. అక్షయపాత్ర సంస్థ ద్వారా భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని డ్రెయిన్లలో సిల్టు తొలగించాలని మంత్రి సూచించారు. కుక్కల సమస్య అధికంగా ఉందని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటికి శస్త్ర చికిత్సలు చేయించుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మునిసిపల్ నిధులను స్థానిక అవసరాలకు వినియోగించేలా సీఎం చంద్రబాబును కోరానని దీనికి ఆయన సుముఖత వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెడన: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన ఒక వ్యక్తి బలవర్మణానికి పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో మంగళవారం అనుమానస్పద మృతిగా కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సలకా శశికిషోర్ (41) మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 4వ తేదీన పైడమ్మ కాలనీలో మద్యంలో గడ్డిమందు కలిపి సేవించాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన మచిలీపట్నం పెద్దాసుపత్రికి, అక్కడ నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కిషోర్ చనిపోయాడు. భార్య కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణరావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విజయవాడ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పీఎఫ్ సక్రమంగా అందించేందుకు చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

మచిలీపట్నంటౌన్: నగరంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ సొమ్ము సక్రమంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల పీఎఫ్ వివరాల ఆన్‌లైన్ విధానాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు ఎంత పూర్తయిందో సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని వేగంగా నిర్వహించి వారికి మేలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

నేడు జాతీయ చేనేత దినోత్సవం

హాజరు కానున్న కలెక్టర్ డీకే బాలాజీ

పెడన: జాతీయ చేనేత దినోత్సవం బుధవారం పెడనలోని 16వ వార్డులో నిర్వహించనున్నట్లు చేనేత జౌళిశాఖ ఇంఛార్జి ఏడీ ఎస్ రఘునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు 16వ వార్డులోని పోలవరపుపేట శ్రీఉమారామలింగేశ్వర చౌడేశ్వరి ప్రార్థన మందిరంలో ఈ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకేబాలాజీ తదితరులు హాజరవుతారని, చేనేత కళాకారులను సన్మానిస్తామని, నేతకార్మికులు జయప్రదం చేయాల్సిందిగాకోరారు.

ఏఐడబ్ల్యూఎఫ్.. యూనెస్కో క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో..

జాతీయ చేనేత దినోత్సవం పెడనలోని పడమట వీధిలోని శ్రీవిఘ్నేశ్వర ప్రార్థన మందిరంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న ఏఐడబ్ల్యూఎఫ్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడు పిచ్చుక ఫణికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దూరదర్శన్ వార్త విభాగాధిపతి డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గుత్తికొండ కొండలరావు హాజరవుతారని పేర్కొన్నారు. పలువురికి అవార్డులను కూడా అందజేస్తామని, చేనేత కార్మికులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలి

డీవైఈవో శేఖర్ సింగ్



పెడన: మధ్యాహ్న భోజనం విషయంలో విద్యార్థులలో కొన్ని అపోహలున్నాయని, వాటిని తొలగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మచిలీపట్నం డీవైఈవో శేఖర్‌సింగ్ అన్నారు. డీఈవో తాహెరాసుల్తానా ఆదేశాలతో మంగళవారం డీవైఈవో శేఖర్ సింగ్ పదో తరగతి విద్యార్థులతో మమేకం అవ్వడంతో పాటు వారికి మోటివేషన్ క్లాసులు తీసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సోమవారం రెండున్నర గంటల పాటు డీఈవో ఈ పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఈ విషయమై 'బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో డీఈవో విచారణ' అంటూ 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన వార్త పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో డీవైఈవో శేఖర్ సింగ్‌ను మంగళవారం ఉదయమే పాఠశాలను సందర్శించి పరిస్థితిని నివేదిక రూపంలో ఇవ్వాలని డీఈవో ఆదేశాల మేరకు శేఖర్‌సింగ్ పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి ఎంత మంది భోజనం చేస్తున్నారనే వివరాలను మధ్యాహ్న భోజనం ఏడీ మనోహర్‌నాయక్‌తో కలిసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో శేఖర్ సింగ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పట్ల 9, 10వ తరగతి విద్యార్థులు విముఖత చూపుతున్నారని, అదేమని వారిని ప్రశ్నిస్తే వంటికి పడటం లేదని చెబుతున్నారని అన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకుని మధ్యాహ్న భోజనం చేసేలా ప్రొత్సహించాల్సి ఉందన్నారు. చిన్న తరగతులకు చెందిన విద్యార్థులు బాగానే భోజనం చేస్తున్నారని, ఉపాధ్యాయులను ఆయా సబ్జెక్టులు వారీగా బోధనకు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలను తరుచూ తనిఖీ చేస్తామన్నారు. చిన్న చిన్న పొరబాట్లను సరిదిద్ది పాఠశాలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం తీర్థావతి, ఉపాధ్యాయులున్నారు.